# రెండరటికాయల కథ




"అబ్బా! ఏమిటి ఎండిలా మండి పోతూందే?" అని ఆశ్చర్యపోతూ విచారించాడు సత్యమూర్తి. ఏడాది కెనిమిది నెలలు ఈ ఊళ్ళో ఎండే మాడ్చి చంపేస్తుంది, ఉక్కే ఉడక బెట్టేస్తుం దని చిరాకు పడ్డాడు. మాటినీ కెళ్ళి హాల్లోంచి ముద్ద ముద్దయి ఇవతల పడ్డాడు. వెధవ మాటినీకి మరెప్పుడూ వెళ్ళకూడ దనుకుంటూనే అదేమిటో వెళ్ళిపోతాడు. ఆరు గంటలాటు కెళితే ఇంట్లో తెలిసిపోతుంది. లక్ష యక్ష ప్రశ్నలు వేస్తారు— సినిమాలు తెగ చూస్తున్నావు చదువెత్తి గట్టే అని అత్తగారు కోడల్ని సాధించినట్టు! ఆఫీసరు గుమాస్తాని సాధించినట్టు సాధించి తినేస్తారు. ఈ స్టూడెంటు పీరియడులో వెధవది ఎన్నో బాధలు. 'ఎలాగో ఈ బి.ఎ. అయిపోతే, ఓ ఉద్యోగం వస్తే అప్పు డింక మన్ని ఇంత సాధించ రెవళ్ళూ' అనుకున్నాడు సత్యమూర్తి. రుమాలు పిండి, మొహం, మెడా తుడుచుకున్నాడు. ఈ ఉక్కేమి టిలా శత్రువులా బాధ పెడుతూంది. వెధవది! ధర లెలా మండి పోతున్నాయో? వర్తకుల అన్యాయం ఎలా మండి పోతూందో! ఈ ఉక్కలా మండి చస్తూందని తిట్టుకున్నాడు. బజారు చాలా రష్‌గా ఉంది. ఎక్కడా సందు లేకుండా జనం, వాహనాలూ తిరుగాడు తున్నారు. పేవ్‌మెంటు మీదికి వచ్చి నిలబడి కొంచెం ఊపిరి పీల్చుకున్నాడు సత్యమూర్తి.

ఈ జనాన్ని, ఈ హడావుడినీ చూస్తూంటే చటుక్కున ఓ ఆలోచన వచ్చిం దతనికి. చాన్నాళ్ళయింది కథ వ్రాసి. ఈ జన చైతన్యం మీద, ఈ రొద మీద, వీళ్ళ ఆరాటంమీద ఓ కథ—చిన్నది వ్రాస్తే ఎలా ఉంటుందనిపించింది. బాగుంటుంది గాని, తను చదువు కుందుకే బాగుంటుంది! పత్రిక వాళ్ళకి బాగుండదు. వాళ్ళకి బాగుందనిపించేవి వేరే కథలున్నాయి. ఇంటి కథలు, బయటి కథలు. . . పోనీ, చాన్నాళ్ళయింది. వెధవది జేబులో బొత్తిగా డబ్బుల్లేవు. వాళ్ళకి కావలసిన కథే వ్రాస్తేపోయె! కాని, ఆ కథకి మట్టుకు మేటరు? సత్యమూర్తి అటు, ఇటు చూస్తూ ఆలోచించాడు...

ఇలా ఈ దోవన ఓ అబ్బాయి వెళుతూ ఉంటాడట రోజూను. అతని ఇల్లు ఈ దగ్గర్లోనే ఉండటం వల్ల, సాయంత్రం షికారుకి వచ్చినట్టు కాస్త దూరం వెళతాడట. ఓ రోజు ఓ అమ్మాయి అతన్ని రాసుకుంటూ నడిచిపోయిందట. అబ్బాయికి ఒళ్ళు మండి ఆమెని పిలిచి, "మనిషిని చూసుకోలేదా?" అనడిగితే— "మని షనుకోలేదు" అందట. 'ఎంత పొగరు!' అనుకున్న అబ్బాయి, 'ఎంత అందం!' అనికూడా అనుకోకుండా ఉండ లేకపోయాడట. మాటకి మాట ఇద్దామను కుని అమ్మాయి ఈ సారి నోటితో బాటు చెయ్యికూడా విసురుతుందని మానేశాడట. ఆ తరవాత ఎప్పుడో అప్పు డిద్దరూ ఎక్కడో అక్కడ తారసపడి కారాలూ, మిరియాలూ నూరుకునే వారట. కథ చివరికి అబ్బాయి పెళ్ళి చూపుల్లో ఆ అమ్మాయినే రచయిత కూర్చోపెట్టా డట చాపమీద. అబ్బాయి మొదట భయపడ్డా తరవాత చేసుకుంటే ఈమెనే చేసుకుని పొగరు వదిలించా లనుకున్నాడట. అమ్మాయి మొదట చాలా సిగ్గుపడి పోయినా తరవాత ఇతన్నే చేసుకుని జీవితాంతం సాధించి మురిసిపోవాలను

## శివల జగన్నాథరావు

కుందట. కథ కంచికీ, రచయిత కలం జేబులోకి. . .

సత్యమూర్తి కథని మరో మారు తలుచుకుని మురిసిపోతూ ఉలిక్కిపడ్డాడు. తన నెవరో రాచుకుని వెళ్ళిపోయిన ట్టయితే, కొంప దీసి తన కథలో అమ్మాయి కాదు గదా అనుకుని చుట్టూ చూశాడు. ఇద్దరు పిల్లలు—ఏడెనిమిదేళ్ళ వాళ్ళు-గబగబఉరుకుల్లా పరుగులతో తననీ, అందర్నీ రాచుకు వెళ్ళిపోతున్నారు. సత్యమూర్తికి ఒళ్ళు మండి వాళ్ళని కేకేశాడు. వాళ్ళు రాగానే "బుద్ధి లేదూ? చూసుకుని నడవలేరూ? అలా మనుష్యుల్ని తోసుకుపోతారేమిటి ఎద్దుల్లాగ?" అని దబాయించాడు. పిల్లలిద్దరు బిక్కమొహా లేసుకున్నారు. "చూస్కో లేదంకి" అన్నాడు ఒకడు. ఇంకోడు "అన్నయ్యా! అమ్మ దెబ్బ లాడుతుంది. వేగిరం వెళ్ళక పోతే" అన్నాడు. సత్యమూర్తి వాళ్ళని పరీక్షగా చూశాడు. చాలా అర్భకంగా ఉన్నారు. చిరిగిపోయి, అతుకులు కుట్టు కున్న చిన్నలాగులు, చొక్కా వేసుకున్నాడు. దరిద్రదేవతకి నైవేద్యం అయిపోతున్న బలి జంతువుల్లా ఉన్నారు. బక్కచిక్కిన జంతువులు.

సత్యమూర్తి నడుస్తున్నాడు. వాళ్ళు నడుస్తున్నారు. అక్కడ మరీ జనసమ్మర్దంగా ఉంది. కూరలు కొనేవాళ్ళు కొంటున్నారు. పువ్వులు కొంటున్నారు. పళ్ళు కొంటున్నారు. అక్కడే వేరుసెనగ కాయలూ, జీళ్ళూ, అల్పమయిన చిల్లర తిళ్ళూ కొనుక్కు తింటున్నారు కొందరు. ఉన్నట్టుండి ఆ కుర్రాళ్ళిద్దర్లో ఒకడు— "అయ్యో!" అన్నాడు. "డబ్బుల్లేవే" అన్నాడు. సత్యమూర్తి వాళ్ళు అక్కడ చిరుతిళ్ళు కొనుక్కు తింటారనుకున్నాడు. తను గుప్పెడు వేరుసెనగాయలు కొను క్కుని జేబులో పోసుకున్నాడు. "అడిగావా" అన్నాడో అబ్బాయి.

"అడిగాను. పది పైసలు ఇవ్వరట" అన్నాడు రెండో కుర్రాడు.

"మరెలా. . . మన దగ్గిర ఇరవై యేసైస లున్నాయి గదా?"

"ఇంకో చోట అడుగుదాం." ఇద్దరూ అక్కణ్ణించి వెళ్ళారు. సత్యమూర్తికేం బోధపడటం లేదు. వాళ్ళేమిటి కొంటారు? ఏమిటి కావాలి? అనుకున్నాడు. ఇంతలో ఓ మూల నించి కేకలు వినిపించాయి. కొట్లాటలా ఉంది. కొట్లాటలంటే సత్యమూర్తికి 'ఏ' సర్టిఫికేటు పిక్చర్లంత ఇష్టం! గబగబా అక్కడికి వెళ్ళాడు. ఇందాకటి కుర్రాళ్ళిద్దరితో మరో కుర్రాడు పోరాడుతున్నాడు. తిట్టుకుంటున్నారు. బూతులు కూసుకుంటున్నారు. కిందా మీదా పడుతూ కుస్తీ పడుతున్నారు. బట్టలు మరింత చింపేసుకుంటున్నారు. ఒళ్ళంతా నెత్తుటి చారలు తేలుతున్నాయి. ఆ మూడో కుర్రాడు పెద్ద రాయి తీశాడు.

"క్రొటా చూద్దాం. . ." అన్నాడీవతలవాడు.

"కొడితే పచ్చారుకుంటావు!" బెదిరిస్తున్నాడు వాడు.

సత్యమూర్తికి సినిమా సీను చూడ్డాని కింపుగానే ఉన్నా, అక్కడ వించుని తప్పిన పనులు మరిచిపోయి చూస్తున్న కొంతమందిలా అదే పనిగా చూడలేక పోయాడు. వాళ్ళ ఫోర్సు చూస్తుంటే అక్కడో హత్యలాంటిది జరిగేట్టుందని పించి వెళ్ళి, "ఎందుకలా కొట్టుకుంటున్నారు?" అని అడిగాడు.

"చేతపోతే సూడండి! నాను అల్లడబ్బులు దొంగలాడేసే నంటున్నాడు" అన్నాడు మూడో అబ్బాయి పళ్ళు బిగపడుతూ.

"తియ్యేదూ? మవ్ తియ్యేదూ? నేను జోబీలోంచి డబ్బులు తీస్తుంటే వచ్చి గుద్దేనేదూ? కింద పడిపోతే ఇరవయి పయిసాలు నాగేనేదూ?" ఉక్రోషంతో అరిచే డివతల కుర్రాడు.

రాయి తీసిన వాడు ఈ ఇద్దరి కంటే కొంచెం పొడుగ్గా ఉన్నాడు. ఈ ఇద్దరి కంటే దరిద్రం ఓడుతున్నాడు.

"మల్లా మాట్టాడేవంటే మక్కిరిసేగల్ను!" రాయి చూపిస్తూ బెదిరించాడు వాడు.

"ఏయ్! ఆ రాయి పారేయ్ ముందు" అని కేకేశాడు సత్యమూర్తి.

వాడేమనుకున్నాడో రాయి విసిరేశాడు. అదో కుక్కపిల్ల పొట్టకి తగిలి అది కుయ్యుమంది. సత్యమూర్తి వాళ్ళ మధ్యకి వెళ్ళాడే గాని, వాళ్ళ తగువెలా పరిష్కరించాలో బోధపడలేదు. "సూడండి, బాబూ! మేం తెచ్చుకున్న డబ్బులు దొంగలాడీసి, ఏం తెల్దంటున్నాడు." ఫిర్యాదు చేశాడు ఒకడు.

"రేయ్! జార్త! మల్లా అలా అన్నావంటే బొమిక లేరిగల్ను!" పొడుగు కుర్రాడు ఊరుకోవడం లేదు.

"దొంగనాకొడకా! డబ్బుల్తీసిమల్లా పెద్ద నీలుగుతావ్‌రా!" వాడి మాటని సహించలేనట్టు ఈ ఇద్దర్లో ఒకడు వెళ్ళి కలబడి పోయాడు. పొడుగు కుర్రాడు వాణ్ణి రావణాసురుడి అనుచరులు మునీశ్వరుల్ని మట్టుబెట్టేసినట్టు కసిమ్మేస్తున్నాడు! సత్యమూర్తి వాళ్ళని వారించేలోగా ఆ రెండో కుర్రాడు పొడుగు వాడిమీద వెళ్ళి పడ్డాడు. ఇద్దర్నీ వాడు బాకిరేవు పెట్టేస్తున్నాడు. అయినా, ఇద్దరూ వాణ్ణి పడదోస్తున్నారు. కసితో, క్రోధంతో కొడుతున్నారు. సత్యమూర్తి కలిగించుకోబోయి వాళ్ళ ఫోర్సు చూసి తనకీ ప్రమాదం అవుతుందని జంకాడు. ఆఖరికి యుగధర్మంలా, కలిన్యాయంలా పొడుగు కుర్రాడే జయించాడు. సత్యమూర్తి కెందుచేతో వాడు దొంగతనం చేసినట్టే అనిపిస్తోంది. కాని, వాడు ఒప్పుకోవడం లేదు మరి! ఏమో! తనా మాటంటే తన మీదా తిరగబడేట్టున్నాడా వెధవ అనుకున్నాడు సత్యమూర్తి. వీళ్ళని బూతులు తిట్టేసి వాడు వెళ్ళిపోతున్నాడు! వీళ్ళిద్దరు దాదాపు ఏడ్చేస్తూ వాణ్ణి తిడుతున్నారు. దుఃఖంతో పగర్పుతో, చేతకాని శౌర్యంతో వాళ్ళ గుండెలు ఎగిరెగిరి పడుతున్నాయి.

సత్యమూర్తికి వాళ్ళని చూస్తే జాలేసింది. బాధ కలిగింది. వాళ్ళు సత్యమూర్తి దగ్గిరకి వచ్చారు. "ఏవండయ్యా! పది పైస లియ్యండి. . ." చేతులు చాచి అడిగా డొకడు.

"పది పైసలు ధర్మమా?" సత్యమూర్తి ఆశ్చర్యపోయాడు. తనేమన్నా బలిచక్రవర్తా? నామను డడిగిందే చాలని చేతులు కడిగేసుకోందికి? ఒకటో రెండో పైసలైతే ఇస్తాడు కాని. . . అయినా, వీళ్ళకి డబ్బు లెందుకు కవలు? డబ్బు లెందుకు పారేసుకున్నారు వెర్రివెధవల్లా? అసలు పారేసుకున్నారా? లేకపోతే వేషాలేస్తున్నారా? వీళ్ళు దొంగలు కారుగదా? ఇదంతా నాటకం కాదు గదా! అమ్మో? రకరకాల నాటకాలు! కూటి కోసం కోటి విద్యలు! లక్ష వేషాలు!



దేవి

ఫొటో—కె. వి. రావు (ప్రదాటు)

సత్యమూర్తి వాళ్ళని కసరబోయి ఎవరో అమ్మాయి తనని చూడ్డం చూసి, ఆ చూపులో 'నువ్వెంత పిసినారి వాడివి' అనిపించి, వెంటనే జేబులోంచి టకీమని అయిదు పైసలు తీసి ఇచ్చాడు. వాళ్ళు అక్కడి వాళ్ళని ఒకటీ, రెండూ, అయిదూ పైస లడుక్కుంటున్నారు.

సత్యమూర్తి ఆ కుర్రాళ్ళలో ఒకణ్ణి పిలిచాడు. అతనికి ఏ ధర్మ డబ్బుల్ని అన్ని దానం చేయరు గదా అనిపించి జాలేసింది. "ఏమిటి కొంటారు?" అనడిగాడు.

ఆ కుర్రాడు మట్టి చేత్తో బుర్ర గోక్కుని, "అంటికాయలు, బాబూ" అన్నాడు. "మా యమ్మ అంటికాయలు తెంగ్రమ్మ కొనితెమ్మని ఇరవయి పయిసా లిచ్చింది. ఆ డబ్బులు ఆ దొంగెధవ దొంగలాడీసేడు" అన్నాడు.

"అంటికాయలకా?" సత్యమూర్తి విస్తుపోయాడు.

"అవును, బాబూ! మా కియ్యాల తిండాని కేట్నేదు. రేత్రి అమ్మ అడుక్కు తెచ్చిన అన్నం అయ్య దాస్తే, మమ్మల్ని తన్నేసి తినిపోనాడు. సిన్నపిల్ల ఆకలాకలని ఏడుత్తాంది. గంజి తెచ్చి పొద్దానంటే పొద్దున్న అమ్మ జొరం వచ్చి అయ్య తన్నులో పడుకుంది కదల్లేక. మా ఇద్దరం ముష్టి కెళితే ఎవ్వరూ వెయ్య లేదు, గంజిసీల్ను. ఇరవయి పయిసాలు దొరికేయి. పొద్దున్నించి ముష్టెత్తితే అయ్య కాస్తా ఆ దొంగనా..." దుఃఖం వచ్చి కళ్ళు తుడుచుకున్నాడు. తుడుచుకుని, "అమ్మ ఇరవయి పయిసా ఇచ్చి అంటికాయ లట్టమ్మంది. అయ్యకి కాల్చుకుని తల కింత తిండానికి. . ." అన్నాడు.

"ఒరే, అప్పిగా!" మరోడు కేకేస్తే వెళ్ళిపోయాడు గబగబ.

సత్యమూర్తి నిట్టూర్చాడు వాళ్ళని చూస్తూ. భుజం మీద చెయ్యి పడితే తిరిక్కి పడ్డాడు. స్నేహితుడు మధుమూర్తి.

"ఏమిటి, గురూ! కొంప దీసి కథ రాసేస్తే నేమి టక్కడ కాస్తేవు? మేటరు కోసమా?"

సత్యమూర్తి—"ఆఁ. . . రాస్తాను" అన్నాడు. 'రాస్తాను. . . ఇందాకటి కథ కాదు. . .' అనుకుని స్నేహితుడితో నడిచాడు.